పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గ్రామ పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర ఏజెన్సీ మహిళ విభాగ అధ్యక్షురాలు కే,కృష్ణకుమారి చెప్పారు. మండలంలోని లివిటిపుట్టు గ్రామంలో సోమవారం సందర్శించి ఆ గ్రామస్తులకు సబ్బులు, నూనె లను ఆమె ఉచితంగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో వ్యాధులు ప్రబలకుండా ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా జలుబు, దగ్గు వంటి వ్యాధులు సోకే అవకాశం ఉందని ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన సురక్షిత తాగునీటిని ఉపయోగించాలని ఆమె సూచించారు.

సరుకులు ఇస్తున్న కృష్ణకుమారి

ఆదివాసీ సమస్యలపై నోరు మెదపని పవన్

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - చింతపల్లి : మన్యంలో జీవో 3 రద్దు, హైడ్రో పవర్ ప్రాజెక్ట్, 1/ 70, తదితర వాటిపై స్పష్టత లేకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన సాగిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కే.లోకనాథం విమర్శించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ మాతృమూర్తి దినకర్మ సందర్భంగా తాజంగి పంచాయతీ వంతమామిడి వచ్చిన లోకనాథం మాట్లాడుతూ, స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లపై పడుతున్నప్పటికీ నేటికీ మారుమూల గ్రామాల్లో రహదారులకు నోచుకోలేదని, గిరిజనులు ఎంతకాలం డోలి మోతలతో ఇబ్బందులు పడాలని ప్రశ్నించారు. ఏజెన్సీలో గిరిజనులకు తీవ్రమైన సమస్యలు ఉన్నాయని, దేని పైనా పవన్ కళ్యాణ్ నోరు మెదపకుండా పర్యటన సాగిందని దుయ్యబట్టారు. కాఫీ రైతులకు కాపీ కొనుగోలులో తీవ్ర అన్యాయం జరుగుతుందని, నాణ్యమైన గిట్టుబాటు ధర కల్పించడంలో కాపీ బోర్డు, రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులకు మేలు చేసే కార్యక్రమాలు ప్రభుత్వం చేపడితే స్వాగతిస్తామని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ పర్యటనలో గిరిజనులకు ఒరిగిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కే.సురేంద్ర, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వి శంకర్రావు, సన్నీబాబు, సుందర్రావు, అనకాపల్లి జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు త్రిమూర్తులురెడ్డి, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లోకనాథం

మెడకు ఉరితాళ్లతో వినూత్న నిరసన

38వ రోజుకు చేరిన గురుకుల ఔట్ సోర్సింగ్ టీచర్ల ఆందోళన

ప్రజాశక్తి-రంపచోడవరం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గిరిజన గురుకుల విద్యాలయాల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు చేపట్టిన ఆందోళన 38వ రోజుకు చేరింది. స్థానిక ఐటిడిఎ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న నిరాహార దీక్ష శిబిరం వద్ద గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సోమవారం మెడకు ఉరి తాళ్లు తగిలించుకుని వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. శాంతియుతంగా గాంధేయ మార్గంలో తాము ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వీరి ఆందోళనకు ఆదివాసీ జెఎసి నాయకులు రామన్న దొర మద్దతు ప్రకటించి మాట్లాడారు. గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న 1659 ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలపై ఐటీడీఏ పీఓకి జెఎసి తరఫున వినతిపత్రం సమర్పించామని, వెంటనే ప్రభుత్వానికి తెలియజేసి సమస్యలు పరిష్కరించుకుంటే జెఎసి తరఫున ప్రత్యక్ష పోరాటం చేస్తామని తెలియజేసినట్టు చెప్పారు. పది పదిహేను సంవత్సరాల నుంచి గురుకులాలనే నమ్ముకుని అతి తక్కువ జీతాలతో ఉదయం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు పాఠశాలలోనే ఉంటూ పనిచేస్తున్నారని తెలిపారు. వారి శ్రమను ప్రభుత్వం, అధికారులు గుర్తించకుండా, 2024 డీఎస్సీలో వారి పోస్టులను కలపడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 1659 గిరిజన గురుకుల ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే స్పందించి పరిష్కరించాలని కోరారు. యుటిఎఫ్, సిపిఎం, సిఐటియు, గిరిజన సంఘాల నాయకులు మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో గిరిజన గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు అనంత కుమారి, శామ్యూల్, తాతాజీ, సత్యనారాయణ రెడ్డి, పాపయమ్మ పాల్గొన్నారు.

మెడకు ఉరితాళ్లు వేసుకొని నిరసన తెలుపుతున్న గురుకుల కాంట్రాక్టు ఉపాధ్యాయులు

3 నుంచి పీసా కమిటీ ఎన్నికలు

ఓటర్ల జాబితా రూపొందించాలి- ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు : అల్లూరి జిల్లాలోని పాడేరు ఐటీడీఏ పరిధిలో గల 239 పంచాయతీలు, మైదాన ప్రాంతమైన నాతవరం మండలంలోని ఐదు పంచాయతీలు మొత్తం కలిపి 244 పంచాయతీలలోని 1026 పీసా గ్రామాలలో ఉపాధ్యక్ష, కార్యదర్శి పదవులకు 2025 జనవరి3 నుండి7 వరకూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ తెలిపారు. సదరు ఎన్నికల నిర్వహణ నిమిత్తం మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, తహశీల్దార్లు, ఈ.ఓ.ఆర్డీలు, మండల ప్రత్యేక అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించారు. పార్టీ రహితంగా జరుగుతున్న సదరు ఎన్నికలలో పీసా గ్రామాలకు చెందిన గిరిజనులు ఎవరైనా పోటీ చేయవచ్చని, ప్రత్యేక గ్రామసభ సమావేశంలో చేతులెత్తే విధానం ద్వారా ఎన్నికలు నిర్వహిస్తారని, గెలచిన అభ్యర్థులకు ఐదు సంవత్సరాల పదవీ కాలం ఉంటుందని ప్రాజెక్టు అధికారి తెలిపారు. తహశీల్దార్లు తక్షణమే ఓటర్ల జాబితాలు రూపొందించాలని ఆదేశించారు. శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించడానికి స్థానిక స్టేషన్ హౌస్ అధికారులను సమన్వయం చేసుకోవాలని సూచించారు.

అనంతరం డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీ పి.యస్.కుమార్ మాట్లాడుతూ యం.పీ.డి.ఓ లు మండల పరిధిలో వున్న అన్ని పీసా గ్రామాలకు ఎన్నికల అధికారులను , సహాయ సిబ్బందిని తక్షణమే నియమించాలని, ఆయా గ్రామాల లోని ప్రభుత్వ భవనాలలో మాత్రమే ఎన్నికలకు నిర్వహణకు అవసరమైన గ్రామసభలు నిర్వహించాలని- సదరు ఎన్నికల నిర్వహణకు ముందుగా అన్ని గ్రామాలలో అవగాహనా సదస్సులు నిర్వహించాలని కోరారు. ఎన్నికల నిర్వహణ, ఫలితాలతో విభేదించిన వారు 60 దినములలోగా గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు వద్ద అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు.అనంతరం డి.ఎల్.పి.ఓ కుమార్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మండల అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారులు ప్రభాకర రావు,వేంకటేశ్వర రావు, గిరిజన సంక్షేమ శాఖ డి.డి రజనీ పాల్గొన్నారు.ఆర్.ఓ.ఎఫ్.ఆర్ డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వరరావు మండల అధికారులకు ఎన్నికల నిర్వహణకు అవసరమైన మెటీరియల్ అందచేసారు.

మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ప్రమాదభరితంగా ప్రధాన రహదారి

ప్రజాశక్తి-సీలేరు

జికె.వీధి మండలం సీలేరు జల విద్యుత్ కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి సిపిహెచ్ క్యాంపు దిగు భాగం ప్రమాదమలుపు సమీపంలో రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదభరితంగా మారింది. చింతపల్లి సబ్ డివిజనల్ ఆర్ అండ్ బి అధికారులు రక్షణ గోడ నిర్మించుకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వాహన చోదకులు బిక్కు బిక్కుమంటూ వాహనలు నడుపుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రదేశం దిగువన రెండు వందల అడుగుల లోయి ఉండడంతో ప్రమాదవశాస్తు ఏదైనా జరిగితే ప్రాణాలతో బయటపడే పరిస్థితి లేదని ఈ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బి అధికారులు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ నుండి సీలేరు మీదుగా భద్రాచలం తిరిగి బస్ సర్వీసులతో పాటు విజయవాడ, రాజమండ్రి బస్ సర్వీసులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. జల విద్యుత్ కేంద్రానికి వెళ్లే విద్యుత్ ఉద్యోగులు షిఫ్ట్ బస్సు ఇతర వాహనాల్లో తరచూ విధి నిర్వహణకు వెళ్లి వస్తుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందని ఉద్యోగులు భయంతో విధి నిర్వహణకు వెళ్లాల్సి వస్తోంది. ఏపీ జెన్కో అధికారులు తాత్కాలిక చర్యలో భాగంగా ప్రమాదాలు జరగకుండా కాంట్రాక్ట్ లేబర్‌తో కర్రలుపాతి దానికి ఎర్ర గుడ్డలు కట్టి హెచ్చరిక ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు తక్షణమే స్పందించి రక్షణ గోడ నిర్మించాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రక్షణ గోడ లేక ప్రమాదకరంగా ఉన్న ప్రదేశం ఇదే..

బాల్య వివాహాలను అరికట్టాలి

జెడ్‌పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య

ప్రజాశక్తి - చింతపల్లి: బాల్య వివాహాలను నిలువరించేందుకు గ్రామంలోని అంగన్వాడి లు, ఆశా కార్యకర్తలతో పాటు సచివాలయ సిబ్బంది సహకారం అవసరమని జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. చింతపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు కు సంబంధించి మండల స్థాయి కిషోర్ వికాసం శిక్షణా కార్యక్రమం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఐసిడిఎస్ సిడిపిఓ రమణి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్పిటిసి పోతురాజు బాలయ్య, ఎంఈఓ పనసల ప్రసాద్ లు మాట్లాడుతూ, మానవ జీవితంలో శారీరకంగా, మానసికంగా మార్పులు వచ్చే దశ కౌమార దశ అన్నారు. ఈ దశలో వారికి అవగాహన కల్పించి సన్మార్గంలో నడిచే విధంగా తీర్చిదిద్దవలసిన అవసరం అటు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులపైనా ఉందన్నారు. అంగన్వాడీలు, ఆశాలు, మహిళా సంరక్షణ అధికారినిలు, ఏఎన్ఎం తదితరులంతా గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.తల్లిదండ్రులు పిల్లలకు చిన్నతనంలోనే వివాహాలు జరిపించేందుకు ప్రయత్నాలు చేస్తుంటారని, వాటిని గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలతో జరిగే నష్టాన్ని వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు స్వామి, విజయ కుమారి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సత్యవతి, గౌహరున్నీషా, అప్పల నరస, గౌరీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాలయ్య

వెలుగు యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలి

4వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-రంపచోడవరం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రంపచోడవరం ఐటీడీఏ ఎదురుగా వెలుగు యానిమేటర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 4వ రోజుకి చేరాయి. వీరి దీక్షలకు దేవీపట్నం మండల సమైక్య సభ్యురాలు మడకం శంకరమ్మ మద్దతు తెలియజేసి మాట్లాడారు. 17 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంపై సుమారు నాలుగు నెలలుగా తనకు తెలియజేశారని, వారి సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లిన వారు పరిష్కరించలేదని తెలిపారు. విఒఎలు విధులను బహిష్కరించడంతో మహిళా సంఘాల లావాదేవీలు నిలిచిపోయాయని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. రంపచోడవరం రెడ్డిపేట వివోఎ లీడర్ ఆంధ్రమాత మాట్లాడుతూ 17 నెలల నుంచి జీతాలు చెల్లించకపోతే ఎలా జీవనం సాగిస్తామని ప్రశ్నించారు. ప్రతి రోజూ యాప్‌లో అప్లోడ్ చేయాలని అధికారులు ఒత్తిడి తెస్తుంటారని, ఈ పనియడానికి వారికి రీఛార్జ్ చేయడానికి కూడా నగదు లేని పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. కావున అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సంఘం సభ్యులు, విఒఎలు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న వెలుగు యానిమేటర్లు

వాహన ప్రమాదాలపై అవగాహన కల్పించాలి

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - పాడేరు: : హిట్ అండ్ రన్ కేసులలో ఆచూకీ లేని వాహన ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి హైబ్రిడ్ విధానంలో మొదటిసారిగా జరిగిన కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రమాదం జరిగిన సందర్భంలో వాహనాన్ని గుర్తించలేనప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ అంశానికి సంబంధించి ప్రజలలో అవగాహన లేనందున సంబంధిత శాఖ అధికారులు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. గుర్తు తెలియని వాహనాలు డీకొడితే ఎవరైనా పరిహారం కోసం సంబంధిత సబ్ కలక్టర్ వారికి ఫారం -1 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. సుప్రీమ్ కోర్ట్ ఆదేశాల మేరకు జిల్లా పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసామని తెలిపారు. క్లెయిమ్ దరఖాస్తు చేసిన నెల రోజులు లోపు క్లెయిమ్స్ విచారణ ఆఫీసర్ నివేదిక క్లెయిమ్ సెటిల్మెంట్ కమీషనర్ ఇవ్వాలని సూచించారు. క్లెయిమ్ సెటిల్మెంట్ కమీషనర్‌కు నివేదిక వచ్చిన 15 రోజులలో భీమా మొత్తం మంజూరు చేస్తామని తెలిపారు. ప్రతి నెల ఆఖరి మంగళవారం రివ్యూ మీటింగ్ లో నెలవారీ పీరియాడికల్ నివేదిక కమిటీకి ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంయుక్త ట్రాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ పాడేరు సౌర్య మాన్ పటేల్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కె.ప్రమోద్, జిల్లా రవాణా అధికారి లీలా ప్రసాద్, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ జమాల్ బాషా, వర్చ్యువల్ లో సబ్ కలెక్టర్ రంపచోడవరం కల్ప శ్రీ, సివిల్ జడ్జి, సెక్రటరీ వెంకట శేషమ్మ పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదుపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి -పాడేరు:: అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గం సభ్యత్వ నమోదు ప్రత్యేక డ్రైవ్ విస్తృత పరుస్తోంది. ఇందులో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో సభ్యత్వ నమోదుకు కార్యవర్గం పర్యటించి అవగాహన కల్పించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఉద్యోగులందరూ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వం తీసుకుని సహకరించాలని కోరారు. రెడ్ క్రాస్ సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకొని సొసైటీ కి తమ వంతు ఆర్థిక సాయం అందించాలని కోరారు. పాఠశాలల్లో విద్యార్థినిలకు ఆరోగ్య భద్రత, వారి లక్ష సాధన తదితర అంశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రక్తపు నిలువలు పూర్తిగా లేకపోవడంతో జిల్లాలోని రోగులకు అత్యవసర పరిస్థితుల్లో మైదాన ప్రాంతాలకు కేజీహెచ్ లో తరలించే పరిస్థితి నెలకొందని దానిని అధిగమించేందుకు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. అత్యవసర పరిస్థితిలో శుక్రవారం స్థానిక కాపీ హౌస్ లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తం దానం చేసి సహకరించాలని కోరారు. అంతకముందు నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని కలిసి గతంలో మాదిరిగానే రెడ్ క్రాస్ కార్యకలాపాలకు సహకరించాలని విన్నవించారు. దానికి ప్రాజెక్టు అధికారి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు, కార్యదర్శి జి.గౌరీ శంకర్, కోశాధికారి పి సూర్యారావు, జిల్లా కోఆర్డినేటర్ వి.లోహితస్, కార్యవర్గ సభ్యులు టి.ప్రసాద్ నాయుడు, సంజీవరావు, గంగాభవాని పాల్గొన్నారు.

కాఫీకి గిట్టుబాటు ధర చెల్లించాలి

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన కోపరేటివ్ సంస్థ ప్రకటించిన కిలో కాఫీ కి రూ.320 కాఫీ రేటు గిట్టుబాటు కాదని, రూ. 500 రూపాయలు గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన కాఫీ రైతు సంఘం నాయకుడు పాలికి లక్కు సోమ వారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో జిసిసి చైర్మన్ ప్రకటించిన కాఫీ రేటు కూడా గిట్టుబాటు కాదన్నారు .అంతర్జాతీయంగా చూసుకున్నప్పుడు కాఫీ రేటు విపరీతంగా పెరిగిందని, . కిలో కాఫీ పార్చ్మెంట్ రూ.450 నుండి 500 వరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రైవేట్ దళారులు 350 నుంచి 400 కొనుగోలు చేస్తున్నారన్నారు. దానికి ఆధారంగా రెట్లు పెంచాలన్నారు. నిత్యవసర వస్తువులు ధరలు ఆకాశాన్ని అంటుతున్న వేళ గిరిజన ప్రాంతంలో వాణిజ్య పంట అయిన కాఫీని నమ్ముకుని జీవిస్తున్నారన్నారు. అకాల వర్షాలు తుఫాన్ కారణంగా వేసుకున్న రాజ్మ చిక్కులు కూడా పూర్తిగా నష్టపోయారన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

ప్రజాశక్తి-చింతూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ రైతు దినోత్సవం కార్యక్రమం అర్థశాస్త్ర విభాగాధిపతి జి.వెంకటరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ యం.శేఖర్ పాల్గొని మాట్లాడారు. భారత దేశానికి 5వ ప్రధానమంత్రిగా పని చేసిన చౌదరి చరణ్ సింగ్ జయంతి రోజును ప్రభుత్వం జాతీయ రైతు దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. రైతులు నిత్యం శ్రమిస్తున్నారని ప్రజలకు అవసరమైన ఆహార ధాన్యాలను అందిస్తున్నారని తెలిపారు. అర్థశాస్త్ర విభాగాధిపతి జి.వెంకటరావు మాట్లాడుతూ దేశానికి రైతులు వెన్నెముక లాంటి వారని, రైతుల కష్టాన్ని గౌరవించాలని సూచించారు. దేశ భద్రతకు సైనికుడు ఎంత అవసరమో, దేశ ప్రజల జీవనానికి రైతు పండించే పంటలు అంతే అవసరమని పేర్కొన్నారు. 'జై కిసాన్, జై జవాన్' అనే నినాదంతో విద్యార్థులను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఆర్‌సి హెచ్.నాగేశ్వరరావు, యస్.అప్పనమ్మ, బి.శ్రీనివాసరావు, కె.శైలజ, డాక్టర్ వై.పద్మ, జి.హరతి, కె.శ్రీదేవి, కె.శకుంతల, కె.శ్రీలక్ష్మి. జి.సాయికుమార్, యన్.రమేష్ పాల్గొన్నారు.

రైతు దినోత్సవంలో మాట్లాడుతున్న అధ్యాపకులు

ఫిజికల్ డైరెక్టర్‌పై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం ప్రభుత్వ డీఎడ్ కళాశాల ప్రిన్సిపల్‌పై ఈ నెల 19న కళాశాల ప్రాంగణంలో అందరిముందు దురుసుగా ప్రవర్తించి దాడి చేసినందుకుగాను ఫిజికల్ డైరెక్టర్‌ని విధుల నుంచి సస్పెండ్ చేసినట్టుగా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.విజయశాంతి పేర్కొన్నారు. తన కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ ప్రిన్సిపాల్‌పై దాడి సంఘటనను ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారికి సంబంధిత ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపకులు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీనిపై ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ ప్రాథమిక విచారణ చేసి నివేదిక ఇవ్వడంతో పిఒ ఆదేశాల మేరకు ప్రభుత్వ డీఎడ్ కళాశాలలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్‌ను విధుల నుండి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కూనవరం సహాయక గిరిజన సంక్షేమాధికారి కె.సుజాతను విచారణ అధికారిగా నియమించడం జరిగిందని, పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరం నిజ నిర్ధారణ రిపోర్టును పూర్తి స్థాయిలో పరిశీలించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిడి తెలిపారు.

ట్రాఫిక్‌లో నిలిచిన 108 అంబులెన్స్

ట్రాఫిక్ వలయంలో అంబులెన్స్

ప్రజాశక్తి -అనంతగిరి: అనంతగిరి -అరకు ఘాట్ రోడ్డు ట్రాఫిక్ లో మూడు గంటలసేపు 108 అంబులెన్స్ చిక్కుకుంది. సీరియస్ కండిషన్ గా ఉన్న రోగిని అరకు ఏరియా ఆసుపత్రి నుండి మెరుగైన వైద్యం కోసం సోమవారం విశాఖకు అంబులెన్స్ సిబ్బంది తరలిస్తున్న సమయంలో అనంతగిరి -డమ్ముకు, తైడా. శివలింగపురం ఘాట్ రోడ్డు మలుపులలో అంబులెన్స్ గంటల తరబడి నిలిచి పోయింది. అతి కష్టం మీద ఘాట్ రోడ్డు దాటింది.

నేడు సోషల్ ఆడిట్

ప్రజాశక్తి -అనంతగిరి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని వివిధ అభివృద్ధి పనులు చేపట్టిన నేపథ్యంలో ఈనెల 24న మండల ఉపాధి హామీ కార్యాలయం వద్ద బహిరంగ సోషల్ ఆడిట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని స్థానిక ఎంపీడీవో ఏవివి .కుమార్, ఏపీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఉన్న ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు హాజరు కావాలని వారు కోరారు

పోతంగిలో ఘనంగా ఉత్సవాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ కేంద్రంలో పెద్ద దేవుడి ఉత్సవాలను సోమవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం పెద్దదేవుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గిరిజన సంప్రదాయమైన దింసా నృత్యాన్ని ప్రదర్శిస్తూ గిరిజనులు ఘనంగా పండగను జరుపుకున్నారు. ఈ ఉత్సవాల్లో మండలంలోని పోతంగి పంచాయతీ తో పాటు మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో గిరిజన తరలి వచ్చారు. ప్రతి ఏడాది ఘనంగా జరిగే ఈ పండగ ఉత్సవాల్లో పంచాయతి తో పాటు మండల వ్యాప్తంగా గిరిజనులు తరలివచ్చి పండగను జరుపుకున్నారు.

రుషికొండ బీచ్ సౌత్ రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ : వైసిపి హయాంలో ఐదేళ్లు మూసివేతకు గురైన రుషికొండ బీచ్‌కు వెళ్లే సౌత్ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. బీచ్ అందాలను వీక్షించేందుకు వచ్చే పర్యాటకుల ప్రయోజనార్థం కూటమి నాయకులు రోడ్డు ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు ఆ రోడ్డును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు రోడ్డులో నడుచుకుంటూ వెళ్లి తీరం అందాలను వీక్షించారు. పర్యాటకుల సౌకర్యార్థం రోడ్లకు ఇరువైపులా మొక్కలు పెంచి సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత మార్గాల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చూడాలని పోలీసులకు సూచించారు. రుషికొండ బీచ్‌కు వెళ్లేందుకు ఒకే మార్గం ఉండటం చేత వారాంతపు రోజుల్లో సందర్శకులు ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్నారని, ప్రస్తుతం ఈ మార్గం అందుబాటులోకి రావడంతో సందర్శకులకు సౌలభ్యం కలుగుతుందన్నారు. రుషికొండ ప్యాలెస్ కోసం వైసిపి నాయకులు ఐదేళ్లపాటు ఈ మార్గాన్ని మూసివేసారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, టిడిపి నగర అధ్యక్షులు గండి బాబ్జి, జనసేన భీమిలి నియోజవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, జోన్ -2 కమిషనర్ ఎంబిడి ఫణిరామ్, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, కూటమి నాయకులు చిట్టిపిల్లి గోపి, శాఖరి శ్రీనివాస్, అక్కరబోయిన రాంబాబు, సారిపిల్లి శ్రీనివాస్, ఉప్పులూరి గోవిందరావు పాల్గొన్నారు.

విఎంఆర్‌డిఎ ప్రజా దర్బార్‌కు స్పందన

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విఎంఆర్‌డిఎ కార్యాలయంలో చైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్ ప్రారంభించిన ప్రజా దర్బార్‌కు సోమవారం బాధితులు వచ్చి వినతులు అందజేశారు. ఇంజినీరింగ్ -1, ప్లానింగ్ - 7, ఎస్టేట్ - 2 , రెవెన్యూ -2, ఇతర విభాగాలకు సంబంధించి మరికొన్ని వినతులు వచ్చాయి.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

కలెక్టరు ఎ.ఎస్.దినేష్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-హుకుంపేట: రెవిన్యూ సదస్సులో 38 వినతులు స్వీకరించామని జిల్లా కలెక్టరు ఎ.ఎస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం రంగశీల గ్రామ పంచాయతీలో రెవిన్యూ సదస్సులో మాట్లాడుతూ, ఎన్ హెచ్ ఇ 516 రోడ్లలో నష్టపోయిన రైతులకు సర్వే జరిపి న్యాయం చేయాలన్నారు. అన్ రిజిష్టర్డ్ డాక్యుమెంట్స్ ఉన్న వారు విఆర్‌ఒను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. యజమాని మృతి చెందిన వారి స్థానములో కుటుంబ సభ్యులలో ఒకరు ముటేషన్ పెట్టుకోవాలని తెలిపారు. పట్టా విడదీసుకోనుటకు అన్నదమ్ములు ముటేషన్ పెట్టుకోవాలని తెలిపారు. రీ సర్వే ప్రకారం సర్వే నంబర్లు, విస్తీర్ణములు, సరిహద్దులు సరిదిద్దు కోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసిల్దార్ సిహెచ్ కృష్ణారావు, విఆర్‌ఒ ఎం. శ్రీనివాసరావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

పాస్టర్ దంపతులను సన్మానిస్తున్న క్రైస్తవులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని చీకుమద్దుల ల పంచాయితీ, పెదనంది పుట్టు గ్రామంలో క్రిస్మస్ సంబరాలు పాస్టర్ దంపతులు మర్రి అర్జున్-రంభ, సంఘ పెద్ద సీదరి బేసు గార్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ వేడుకల్లో హుకుంపేట మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ... ఏసు క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. ఆపదలో ఉన్నవారికి ఆదుకోవడం జీవితానికి నిజమైన పరమార్థం అన్నారు. ఈ కార్యక్రమంలో చీకుమద్దుల సర్పంచ్ సూకూరు బొంజన్న దొర, గన్నేరు పుట్టు సర్పంచ్ సోకేలి కృష్ణా రావు, మాజీ సర్పంచ్ సూడిపల్లి లక్ష్మీ ప్రమీల, చీకుమద్దుల వైస్ సర్పంచ్ మర్రి ఉత్రన్న, దైవ సేవకులు వంతాల గోపాల్, జాషువా,సాల్మన్, వెంకట్, రాజేష్, కామేష్, కామరాజు, నూకరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చింతపల్లి : మండలంలోని సాయి నగర్ వీధి, ఏపీ ఆర్ కాలేజ్ సమీపంలో నూతనంగా నిర్మించిన మేరీ మాత ఆలయం (గ్రోటో) వద్ద ఫాదర్ హ్యారీ ఫిలిప్స్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రోమన్ క్యాథలిక్ చర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ వేడుకలలో మేరీ మాత గ్రోటో వద్ద ఏర్పాటు చేసిన జీసస్ జీవిత చరిత్రను తలపించే కళాఖండాలు, అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రహదారి పక్కనే మేరీ మాత గ్రోటో ఏర్పాటు చేయడంతో పలువురు బాటసారులు, క్రైస్తవ సోదరులు ఆసక్తిగా మేరీ మాత మండపాన్ని సందర్శించి తిలకిస్తున్నారు. ఈ సందర్భంగా ఫాదర్ హ్యారీ ఫిలిప్స్ మాట్లాడుతూ జీసస్ బోధించిన శాంతి సందేశాన్ని ప్రతి ఒక్కరికి తెలియజెప్పడమే క్రిస్మస్ ప్రత్యేకతని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు జోష్ బాబు, సుభద్ర, వెంకటేష్, శౌర్య, ధారబాబు, క్రీస్తు ఆరాధకులు పలువురు పాల్గొన్నారు.

పాడేరు: యేసు క్రీస్తు ఆశీస్సులు జిల్లా ప్రజలపై పై ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ ఆకాంక్షించారు. స్థానిక కాఫీ హౌస్ లో ఏర్పాటు చేసిన హైటీ క్రిస్టమస్ - 2024 కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం క్రిస్టియన్ హైటీ కార్యక్రమన్నారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, ముందస్తు గా క్రిస్టమస్ శుభాకాంక్షలు అందజేస్తున్నానని తెలిపారు. పాస్టర్లకు గౌరవ వేతనం కింద నెలకు ఐదు వేల రూపాయలు ప్రభుత్వం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. క్రిస్టియన్ విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు ఉన్న అవకాశాన్ని క్రిస్టియన్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, ఏపీఎంఐపి పిడి రహీం పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని నాన్ షెడ్యూల్ భీంపోలు పంచాయితీ సర్పంచ్ తో పాటు పలువురు కార్యకర్తలు టిడిపిలోకి చేరారు విజయనగరం ఆర్టీసీ బోర్డు రీజనల్ చైర్మన్ సివెరి దొన్నుదొర సమక్షంలో సర్పంచ్ జన్ని. బిమలమ్మ. తోపాటు మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు చేరారు. వారిని దొన్నుదొర పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అబివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బొర్రా సర్పంచ్ జె.అప్పారావు, నాయకులు పాల్గొన్నారు

కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దొన్నుదొర

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో గిరిజనుడు మృతి

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని గొచ్చపల్లి గ్రామానికి చెందిన గిరిజనుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన మండలంలోని చోటుచేసుకుంది. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు... మిరియాలు కోయుటకు ఉపయోగించే నిచ్చిన పట్టుకొని వస్తుండగా ఒకసారిగా కరెంటు వైర్ కి తగిలి విద్యుత్ షాక్ కు గురై వంతల చిట్టిబాబు మృతి చెందాడు. చిట్టి బాబుకు భార్య నలుగురు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో చిట్టిబాబు కుటుంబం రోడ్డున పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చిట్టిబాబు కుటుంబాన్ని ఆదుకోవాలని చుట్టుపక్కల ప్రజలు కోరారు.

అద్దె బస్సు అపహరణ కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానిక ఆర్టిసి డిపోకు చెందిన అద్దె బస్సు సోమవారం తెల్లవారుజామున చోరీకి గురైంది. స్థానిక టౌన్ సిఐ గోవిందరావు తెలిపిన వివరాల ప్రకారం నర్సీపట్నం ఆర్టీసి డిపో నుంచి తుని వెళ్లాల్సిన ఆర్టీసి అద్దె బస్సు ఆదివారం అర్ధరాత్రి ఓ వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. ఈ బస్సు ఉదయం 4.30 గంటల సమయంలో నర్సీపట్నం నుంచి తుని వెళ్లాల్సి ఉందని ఆర్టీసి డిపో ఆవరణలో ఉదయం ఈ అద్దె బస్సును తీసుకొని తుని వెళ్లాల్సిన డ్రైవర్ డ్యూటీ సమయానికి డిపో వద్దకు వచ్చి చూడగా బస్సు కనిపించలేదు. దీంతో బస్సు యజమాని గీతంరాజకు తెలియజేశారు. నర్సీపట్నం టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన టౌన్ సిఐ గోవిందరావు రెండు టీంలు ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చింతపల్లి సమీపంలోని చింతలూరు వద్ద చోరీకి గురైన బస్సు పట్టుబడిందని సిఐ తెలియజేశారు. నిందితుడిని తమ అదుపులో ఉన్నాడని, వెల్లడించారు. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం తెలియజేస్తామని చెప్పారు.

గీతం పాలక మండలి సభ్యులుగా జస్టిస్ విజయలక్ష్మి, సిహెచ్.పద్మజ

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులుగా విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కె.విజయ లక్ష్మి, అంతర్జాతీయ బ్యాంకింగ్ రంగ నిపుణురాలు పద్మజా చుండూరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీరిలో జస్టిస్ కె.విజయలక్ష్మి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టులో జడ్జిగా సేవలందించారు. అమె ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి బిఎల్.డిగ్రీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఎల్.డిగ్రీ పొందారు. ఆమె రెండు తెలుగు రాష్ట్రాలలలో ప్రభుత్వ ప్లీడర్‌గా కూడా పనిచేశారు.

పద్మజ చుండూరి భారతదేశంలో, అమెరికాలో 37 సంవత్సరాల బ్యాంకింగ్, క్యాపిటల్ మార్కెట్స్ అనుభవం కలిగిన ప్రముఖ ఆర్థిక సేవలు నిర్వాహకురాలుగా పనిచేశారు. అమె ఎన్ఎస్‌డిఎల్ (నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్), ఇండియన్ బ్యాంక్‌కు ఎమ్‌డి అండ్ సిఇఒగా పనిచేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో డిప్యూటీ మేనేజింగ్ డైరక్టర్‌గా డిజిటల్ బ్యాంకింగ్ సేవలకు నేతృత్వం వహించారు. అమెరికాలో బ్యాంక్ కార్యకలాపాల చీఫ్‌గా మూడేళ్ల పాటు పనిచేశారు. భారత దేశంలో తొలి డిఎల్‌టి బ్లాక్‌చైన్ ఆధారిత ప్లాట్‌ఫారమ్‌ను అభివృద్ధి చేసి కార్పొరేట్ డెబ్ట్ సెక్యూరిటీ, మానిటరింగ్‌ను నిర్వహించడంలో ప్రముఖ పాత్ర పోషించారు. ఎల్ఐసి, ఎన్‌పిసిఎల్ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) బోర్డుల సభ్యురాలిగా ఉన్నారు. ఇద్దరు శక్తివంతమైన మహిళల నాయకత్వం, మార్గదర్శకత్వం గీతం విశ్వవిద్యాలయం ప్రగతికి, మానవ వనరుల అభివృద్ధికి ఉపయోగపడగలదన్న ఆశాభావాన్ని గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ వ్యక్తం చేశారు.

అఖిల భారత అథ్లెటిక్స్ పోటీలకు గీతం జట్టు

ప్రజాశక్తి -మధురవాడ : భువనేశ్వర్‌లోని కిట్ విశ్వవిద్యాలయంలో ఎఐయు ఆధ్వర్యాన ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ పురుషుల పోటీలలో పాల్గొనే గీతం విశ్వవిద్యాలయం జట్టును ఎంపిక చేసినట్లు క్రీడా విభాగం డైరక్టర్ డాక్టర్ యు.విజయకుమార్ తెలిపారు. గీతం జట్టులో గ్లిన్ ఒపియో, ఎల్.బానుతేజ, కె.హరీష్, డి.ధనిక్‌బాబా, ఎమ్.మురారి, మసాంగో మార్టిన్, డి.రాజు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. గీతం జట్టు మేనేజర్‌గా జియాద్, కోచ్‌గా ఎ.మురగన్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

ఆదర్శ రైతును సన్మానిస్తున్న నాయకులు

ఆదర్శ రైతుకు సన్మానం

ప్రజాశక్తి-ఎటపాక : జాతీయస్థాయిలో ఐటీసీ సంస్థ అందించే ఆదర్శ రైతు అవార్డు అందుకున్న గిరిజన రైతు గొంది పసయ్యను ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నేతలు సోమవారం సత్కరించారు. మండలంలోని నర్సింగపేట గ్రామానికి చెందిన గిరిజన రైతు గొంది పసయ్య ఈ నెల 3న ఢిల్లీలో ఐటీసీ సంస్థ నుండి ఆదర్శ రైతు అవార్డును అందుకున్నారు. రోజూ తినే ఆహారంలో ముఖ్యమైన కూరగాయలు ఇతర ప్రాంతాల నుండి దిగుమతి చేసుకోకుండా స్థానికంగా పండించి మార్కెట్‌కు అందించాలనే ఆలోచనతో గొంది పసయ్య 5 ఎకరాలలో 10 సంవత్సరాలుగా డ్రిప్ పద్ధతిలో కూరగాయల సాగు చేస్తున్నారు. ఇందులో టమోటో, బెండ, వంగ, బీన్స్, క్యాబేజీ, కాలిఫ్లవర్ వంటి పంటలను పండిస్తూ స్థానికంగా అమ్ముతున్నారు. పసయ్య ఆదర్శ రైతు అవార్డు అందుకున్న విషయం తెలుసుకున్న ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సోమవారం ఆయన్ను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కాకా అర్జున్ దొర మాట్లాడుతూ ఒక గిరిజన రైతు జాతీయ స్థాయిలో ఆదర్శ రైతుగా అవార్డు అందుకోవడం గర్వంగా ఉందన్నారు. ఇటువంటి రైతులకు ప్రభుత్వం తరపున ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నారు. గిరిజన రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని, సబ్సిడీపై పరికరాలు అందజేయాలని కోరారు. వ్యవసాయ శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే మరికొంత మంది గిరిజన రైతులు ఆదర్శంగా నిలుస్తారని చెప్పారు. కార్యక్రమంలో నక్కా సూరిబాబు, పూనెం వెంకట్రావు, సవలం రాము, పూసం బాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్ అధికారి తేజ పక్షపాతం చూపిస్తున్నారని తుర్రం వెంకటనారాయణ సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పెద్దమటపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలుపై రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ తేజపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతు తుర్రం వెంకటనారాయణ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తేమ పేరుతో ఒక్కో రైతు వద్ద నుంచి సుమారు రెండు నుంచి ఐదు కేజీల వరకు వడ్లు తీసుకొని, టెస్టులు నిర్వహించి, ఆ తర్వాత వాటిని సంబంధిత రైతులకు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. అంతేకాకుండా ధాన్యాన్ని రెండు మూడుసార్లు కూడా తేమ పేరుతో పరీక్షలు చేస్తూ పెద్ద మొత్తంలో ధాన్యం పోగు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ ఇబ్బందులు పడలేక కొందరు రైతులు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించి అమ్ముకుంటున్నారని తెలిపారు. అలాగే తమ నచ్చిన వారి దగ్గర నుండి ముందు కొనుగోలు చేయడం, నచ్చని వారివి కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే మీకు ఇష్టమొచ్చింది చేసుకొండి అంటూ మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సంబంధం అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి అగ్రికల్చర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకొని, గిరిజన రైతులకు న్యాయం చేయాలని కోరారు.

పీసా గ్రామసభకు హాజరు కావాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : ఆదివాసీ స్వయం పాలన సాధికారతకు రూపొందించిన షెడ్యూల్డ్ ప్రాంత పంచాయితీ రాజ్ చట్టం (పీసా చటం) 1996పై గిరిజనులు అవగాహన కలిగించుకొని పీసా గ్రామసభలకు హాజరు కావాలని పీసా కమిటీ పాడేరు డివిజన్ కార్యదర్శి దండా ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ చట్టం ప్రాముఖ్యతను గిరిజనులకు అధికారులు తెలియజేయకపోవడం దురదృష్టకరమన్నారు. పీసా గ్రామసభల ద్వారా మాత్రమే గిరిజన ప్రాంతంత పరిపాలన జరగాలని, కావునా పీసా గ్రామసభ సదస్సులకు గిరిజనులు హాజరు కావాలని కోరారు.

బిల్డింగ్ బైలాస్ జిఓ సవరణపై పలు సూచనలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బిల్డింగ్ బైలాస్ జిఒలో త్వరలో సవరణలు జరగనున్న నేపథ్యంలో ఐఐఎ విశాఖ కేంద్ర ప్రతినిధి బృందం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ విశాఖ సెంటర్ చైర్మన్ ఎఆర్.రాజేశ్ నాగుల ఆధ్వర్యాన డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అదనపు డైరెక్టర్ బిశ్రీనివాసులును కలిసింది. జిఒ సవరణలపై పలు సూచనలు చేసింది. పట్టణాభివృద్ధిలో ఆర్కిటెక్చర్ల క్రియాశీలక భాగస్వామ్యాన్ని నిర్ధారించడానికి బిల్డింగ్ బైలాస్‌పై ముసాయిదా గవర్నమెంట్ ఆర్డర్‌కు సంబంధించిన విమర్శనాత్మక పరిశీలనలు, అభ్యర్థనలను ప్రతినిధి బృందం సమర్పించింది. సానుకూలంగా స్పందించిన బి.శ్రీనివాసులు సూచనలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

కెజిహెచ్‌లో సర్వర్ సమస్య

ఓపీ రోగులకు ఇక్కట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో సోమవారం సర్వర్ మొరాయించింది. దీంతో ఓపీలో వందలాది మంది రోగులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఓపీ కౌంటర్ల సంఖ్యను ఇటీవల ఆరుకు పెంచారు. అయినప్పటికీ అవి చాలక రోగులు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రతిరోజూ 1000 నుంచి 1500 మంది వరకు ఇక్కడి ఓపీకి వస్తుంటారు. సోమవారం ఆ సంఖ్య 2 వేల నుంచి 2500 వరకు ఉంటుంది. అయితే ఈ సోమవారం సుమారు 3 వేల మంది వరకు ఓపీకి వచ్చారు. అదే సమయంలో సర్వర్ పనిచేయలేదు. దీంతో అన్ని కౌంటర్లలో ఓపీ చీటీలు ఇవ్వటానికి అవరోధం కలిగింది. కిక్కిరిసిన కౌంటర్లలో క్యూలైన్లు ముందుకు సాగలేదు. విషయం తెలియక క్యూ లైన్లలో ఉన్న రోగులు తీవ్రస్థాయిలో అక్కడ సిబ్బందితో గొడవలకు దిగారు.

విషయం తెలియడంతో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అక్కడికి చేరుకున్నారు. సర్వర్ పని చేసే వరకూ ఉండకుండా మాన్యువల్ పద్ధతిలో చీటీలు ఇచ్చి పంపే ఏర్పాట్లు చేశారు. ఈ ప్రక్రియ ప్రారంభించిన కొద్దిసేపటికి సర్వర్ పనిచేయడంతో సమస్య పరిష్కారమైంది.

జివిఎంసి స్థాయీ సంఘంలో బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ (జివిఎంసి) 2025-26 సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌కు జివిఎంసి స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని నగర మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. సోమవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘ సమావేశ మందిరంలో జివిఎంసి 2025-26 వార్షిక బడ్జెట్‌పై స్థాయీ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జివిఎంసి 2025-26 వార్షిక బడ్జెట్ ప్రారంభ నిల్వ రూ.47644.49 లక్షలు, అన్ని పద్దుల కింద జమలు రూ.423271.00 లక్షలు, ప్రారంభ నిల్వతో కలిపి మొత్తం జమలు రూ.470915.49 లక్షలు, అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.455427.00 లక్షలు, ముగింపు నిల్వ రూ.15488.49 లక్షలు అని తెలిపారు. సభ్యులు బడ్జెట్‌పై చర్చించిన పిదప స్థూల మార్పులతో సవరణలపై చర్చించి బడ్జెట్‌ను ఆమోదించినట్టు ఆమె వెల్లడించారు.

మంచినీటి ట్యాంకు పరిశీలన

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని పెదమట్టపల్లి గ్రామపంచాయతీ పరిధి బురుగువాడ గ్రామంలో జల్ జీవన్ మిషన్ స్కీం ద్వారా నిర్మించి మంచినీటి ట్యాంకు పగిలిపోయి నీరు వృధాగా పోతున్న నేపథ్యంలో సోమవారం స్థానిక సర్పంచ్ వెట్టి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శివ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెట్టి లక్ష్మి మాట్లాడుతూ త్వరలోనే పంచాయతీ నిధులతో ట్యాంకు మరమ్మతులు చేయించి, గ్రామ ప్రజలకు మంచినీటికి ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, నాయకులు పోడియం శ్రీరామమూర్తి, కారం.సత్తిబాబు, సీతయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ట్యాంకును పరిశీలిస్తున్న కార్యదర్శి శివప్రసాద్, నాయకులు

వినతులు స్వీకరిస్తున్న అధికారులు

'పబ్లిక్ గ్రీవెన్స్'కు 47 అర్జీలు

పజాశక్తి-రంపచోడవరం

స్థానిక ఐటిడిఎ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమానికి ఏజెన్సీ ఏడు మండలాల నుండి 47 అర్జీలు వచ్చాయి. ప్రజల నుండి వాటిని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ, ఐటిడిఎ ఏపీవో జనరల్ డిఎన్వి.రమణ స్వీకరించారు. కార్యక్రమంలో డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి ఆర్‌ఎం డాక్టర్ వెంకట ఇందిరా, డాక్టర్ డేవిడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్బయ్య, ఐ.శ్రీనివాసరావు, గాబ్రియేలు, ఎంపీడీవో యస్.శ్రీనివాసరావు దొర, డిప్యూటీ తహశీల్దార్లు శ్రీధర్, స్వామి, రవీంద్రబాబు, త్రిమూర్తులు, పిఏఓ ఎల్ రాంబాబు, ఏడిఏ కెసిహెచ్‌కెవీ చౌదరి, పిహెచ్ఓ కె.చిట్టిబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మల్లికార్జునరావు, సాయి సతీష్, రామచంద్రమూర్తి, పి.వెంకటరమణ, చైతన్య, ఈపిడి వెలుగు దేగలయ్య, డిఎల్‌డిఓ కె.కోటేశ్వరరావు, డిపిఎం అపర్ణ, డిడి ఆఫీస్ సూపరింటెండెంట్ బి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలెని అంతాడ పంచాయతీ పరిధఙ కొత్తపల్లిలో రూ.22 లక్షలతో సిసి రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు జిసిసి మాజీ ఎంవివి.ప్రసాద్ సోమవారం స్థానిక సర్పంచ్ సూర్ల చంద్రరావు, ఎంపిటిసి ఇరువాడ సత్యవతితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పాడేరు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు కాకూరు చంద్రరావు, బంగారంపేట రాజు, స్థానిక పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని పిట్టచలం గ్రామంలో ఆకేటి వీరరాఘవ, సాయి అనే గిరిజనేతరులు గిరిజన చట్టాలను ఉల్లంఘించి అక్రమంగా పక్కా ఇల్లు నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని ఆదివాసీ జేఏసీ పాడి లోవరాజు, వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వాణి ప్రకాష్, రమణ, పద్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిఎవిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు డిఎవి పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రిస్మస్ తాత వేషధారణలో అలరించారు. పరస్పరం విద్యార్థులు ఉపాధ్యాయులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. క్రిస్మస్ పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డిఎవి ప్రధానోపాధ్యాయులు కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని తెల్లకొండ గ్రామంలో సోమవారం సేవారధి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన నిరుపేద గిరిజనులకు రగ్గులను పంపిణీ చేశారు. బోర్నగూడెం ఆశ్రమ పాఠశాల ఆఫీస్ సబార్డినేట్ దేవరపల్లి తాతాజీ రగ్గులను సమకూర్చినట్లు చోడిబాబు సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా సేవారధి స్వచ్ఛంద సేవలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సేవకులు బీరబోయిన ప్రవీణ్, నేతులు జాషువా పాల్గొన్నారు.